





నస్పూర్‌లో పోచమ్మ ఆలయం వద్ద భక్తులు

## పోచమ్మ బోనాలు

నస్పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఉగాది ముందర గ్రామ దేవతల ను పూజించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం నస్పూర్ కాలనీ పోచమ్మ ఆలయం వద్ద దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. డప్పు చప్పుళ్ళ, భోనాలతో కాలనీల వాసులు ఆలయంకు చేరుకున్నారు. నస్పూర్ కాలనీ, గోదావరి కాలనీ, నాగార్జున కాలనీ, సుందరయ్యనగర్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, ఇందిరమ్మకాలనీ, హౌజింగ్ బోర్డు కాలనీల నుంచి భక్తులు తరలివచ్చారు. గ్రామ దేవతకు మొక్కులు చెల్లించి చల్లంగా చూడమని వేడుకుని మేకలు, కోళ్ళు బలిచ్చారు. కాగా సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయంలో కూడా భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఊరు శ్రీరాంపూర్‌లోని పోచమ్మ గుడిలో భక్తులు పూజలు చేశారు.



పెద్దయ్యస్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు, రైతులు

## పెద్దయ్య ఆలయం వద్ద భక్తుల సందడి

దండేపల్లి, మార్చి 16(ఆంధ్ర జ్యోతి): దండేపల్లి మండల కేంద్రానికి 12కిలో మీటర్ల దూరంలో ఉన్న పెద్దయ్యదేవుని ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ప్రతి ఆదివారం వేలాది మంది భక్తులు, రైతులు, కుటుంబ సమేతంగా వచ్చి పెద్దయ్యస్వామిని దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు కరీంనగర్ ఉమ్మడి జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పెద్దయ్య దేవున్ని దర్శించుకుని పాడి, పంట బాగుండాలని వంటలు మంచి దిగుబడి రావాలని రైతులు స్వామిని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పెద్దయ్య స్వామికి మేకలు, కోళ్లలతో మొక్కులు చెల్లించుకోని గ్రామస్థులు, బంధువులు, కుటుంబసభ్యులతో కలిసి ఆలయం వద్ద విందు వంటకాలు చేసుకుని భుజించారు.

దీంతో ఆదివారం ఆలయం వద్ద వేలాది మంది భక్తులతో సందడి కనిపించాయి.



ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న కాలనీ వాసులు

## రాజారాంలో తాగునీటి కష్టాలు

కోటపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : వేసవికి ముందే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మండలంలోని రాజారాం గ్రామంలోని ఎస్సీ కాలనీలో బోరు మోటారు చెడిపోవడంతో నీటి సమస్య తలెత్తింది. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు అరకి లోమీటరు దూరం నుంచి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడగా పం చాయతీ కార్యదర్శి ఉదయ్ వీరికి గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటి నిసరఫరా చేస్తున్నారు. అయితే ట్యాంకర్ రాగానే కాలనీ వాసులంతా ఎగబడి వచ్చి బిందెలతో నీరు పట్టుకుంటున్నారు. నాయకులు, అధికా రులు స్పందించి తక్షణమే మోటారుకు మరమ్మతులు చేయిస్తే సమస్య పరిష్కారం అవుతుందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. మరమ్మతులకు నిధుల కొరత ఉండడంతోనే మోటారు బాగు చేయించలేకపోయా యనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

దండేపల్లి, మార్చి 16(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షకార్యదర్శులు ఎలుగూరి వేణు, అడ్డగోరి వెంకటేష్‌లు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ పేరు తీసి సూరవరం ప్రతాప్‌రెడ్డి పేరు నిర్ణయించడం సరికాదన్నారు. వెం టనే ఆపేరు తొలగించి పొటి శ్రీరామలు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి గోలి రవీందర్, యూత్ అధ్యక్షకార్యదర్శులు శివ, చిరుత మధు, కోశాధికారి భువనగిరి కిషన్, దండేపల్లి అధ్యక్షుడు నలూమాసు కోమురయ్య, పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట పట్టణంలో ఆర్యవైశ్య సంగాల ఆద్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐబీలో గల ఆయన విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో ఆయన చేసిన సేవలను దీక్షలను గుర్తుచేసి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు నలు మాసు కాంతయ్య, కొత్త వెంకటేశ్వర్లు, రమేష్, కటుకం రమేష్ పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ పద్ధతిలో అధికారుల నియామకం సరికాదు

శ్రీరాంపూర్, మార్చి 16(ఆంధ్ర జ్యోతి): సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్ పద్ధతిలో అధికారుల నియామకం దుర్మార్గమైన చర్య అని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులను సంస్థలోని వ్యక్తులకు కాకుండా బయటి వారితో భర్తీ చేయాలనుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. కాంట్రాక్టు అధికారులు స్వలాభంతో నిర్ణయాలు తీసుకుంటే సంస్థకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు.

# ఎస్టీపీపీలో కొత్త యూనిట్



జైపూర్ మండలం పెగడపల్లి శివారులో ఉన్న సింగరేణి పవర్ ప్లాంట్

- ప్రస్తుతం 1200 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- మరో 800 మెగావాట్ల యూనిట్‌కు సింగరేణి సన్నద్ధం
- రూ.6,700 కోట్లతో బీహెచ్‌ఈఎల్‌తో సంస్థ ఒప్పందం
- 40 నెలల్లో అందుబాటులోకి తెచ్చేలా కార్యాచరణ
- ప్లాంటు విస్తరణతో కొత్త ఉద్యోగాలకు అవకాశం

మంచిర్యాల, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జైపూర్ మండలం పెగడపల్లి వద్ద ఉన్న సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో మరో యూనిట్ ప్రారంభానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 136 సంవత్సరాల చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ 2016 జనవరిలో విద్యుత్ ఉత్పతి వైపు దృష్టి సారించింది. ఇందులో భాగంగా సొంత అవసరాలతో పాటు వ్యా పార దృష్టితో మొదట 600 మెగావాట్ల విద్యుత్ ఉ త్పత్తిని సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ అన తికాలంలోనే మరో 600 యూనిట్లను విస్తరించి మొత్తం 1200 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని సాధిస్తోంది. రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరాలో ఎస్టీపీపీ ప్రధాన పాత్రను పోషిస్తోంది. తాను ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ నుంచి సంస్థ 150 మెగావాట్లు మాత్రమే వినియోగించుకుంటుండగా, మిగితా 1050 మెగావాట్ల విద్యుత్‌ను జెన్‌కో ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విక్రయిస్తోంది.

### అందుబాటులో వనరులు...

విద్యుత్ ఉత్పత్తిని సాధించడం కోసం ప్రధానంగా అవసరమైన బొగ్గు, నీరు అందుబాటులో ఉండటం తో ప్లాంట్‌ను ఏర్పాటు చేయగా, సుమారుగా రెండువేల ఎకరాల భూములను సంస్థ రైతుల నుంచి సేకరించింది. 2015 సంత్సరాంతంలో విద్యుత్ ఉత్ప త్తిని సాధించాలనే లక్ష్యంతో 2011లో కాంట్రాక్టు అవార్డు చేయడంతో పాటు 2012లో అభివృద్ధి పనులను సంస్థ ప్రారంభించింది. రూ.7573 కోట్ల అంచనా వ్యయంతో (రెండు యూనిట్లు) 1200 మెగావాట్ల వి ద్యుత్ ప్లాంట్ పనులు పూర్తి చేయగా మరో రూ. 6,700కోట్ల అంచనా వ్యయంతో మూడో యూనిట్ 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ ప్లాంట్ ఏర్పాటు చేసే లక్ష్యంతో త్వరలో పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది.

### గోదావరి నీరు తరలింపు....

మొట్ట మొదటిసారిగా విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేపట్టిన పెగడపల్లి సింగరేణి పవర్ ప్రాజెక్టుకు అవ సరమైన 3 టీఎంసీల నీటిని గోదావరి, ప్రాణహిత నదుల నుంచి తరలిస్తూ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. గోదావరి నది నుంచి షెట్‌పల్లి, గంగిపల్లి, ఎల్కంటి, పెగడపల్లి శివారుల మీదుగా ప్లాంట్ ఆవరణలో ని ర్మించిన రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటిని తరలిస్తున్నారు. మిగితా 2 టీఎంసీల నీటిని కోటపల్లి మండలం దేవులవాడ శివారు ప్రాణహిత నది నుంచి తరలించడం కోసం ఏర్పాట్లు చేశారు. అలాగే విద్యుత్ ఉత్పత్తికి అవసరమై బొగ్గును శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్టు నుంచి తరలించేందుకు సంస్థ ప్రత్యేక రైలుమార్గాన్ని కూడా ఏర్పాటు చేసింది.

### ఇప్పటికే పూర్తయిన టెండర్ ప్రక్రియ...

ఎస్టీపీపీలో మూడో యూనిట్ ఏర్పాటు చేసేందుకు త్వరలో పనులు ప్రారంభించనున్నారు. ఇప్పటికే 1200 మెగావాట్ల ఉత్పత్తిజరుగుతుండగా, వంద శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధిస్తూ దేశవ్యాప్త రికార్డులు సృష్టిస్తోంది. గత ఐదు సంవత్సరాల్లో ఏకంగా 60వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ను ఉత్పత్తి... (తరువాయి 7లో)

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

మందమర్రిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మూడవ జోన్‌లోని ఆదర్శ విద్యానికేతన్ పాఠశాల 2002-03 పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పాఠశాల ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. తరగతి గదిలో చేసిన చిలిపి చేష్టలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. అనంతరం అప్పుడు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తాము ఈ స్థాయిలో ఉండడానికి కారణం ఉపాధ్యాయు లేనని తెలిపారు. అనంతరం పలు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తోకల నరేష్, వెంకటేష్, రాకం సంతోష్, ఉపాధ్యాయులు సమ్మిరెడ్డి, శంకర్, సాంబమూర్తి, వెంక టేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

- ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

మంచిర్యాల క్రైం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశానికి హాజరై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం పాఠశాలలను బలోపేతం చేయడానికి కృషి చేస్తామన్నారు. 317 జీవో ప్రకారం స్పౌస్ పరస్పర బదిలీలు చేస్తామని, డీఏలు, పీఆర్‌సీలు ఇస్తామని శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడి ఇప్పుడు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని చెప్పడం శోచనీయమన్నారు. పెండింగ్ బిల్లులు, జీపీఎస్ సెలెండర్లు, మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కానిపక్షంలో ఎలాంటి ఉద్యమాలకైన సిద్దమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్యాల పోచమ్మ కొలుపు



నస్పూర్‌లోని ఫ్లడ్ కాలనీలో పోతరాజుల విన్యాసం

నస్పూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం ఫ్లడ్ కాలనీలో ముత్యాల పోచమ్మ కొలుపు ప్రత్యేక పూజలు ఆదివారం ఘనంగా జరిగాయి. కాలనీలో కూడళ్ల వద్ద మేకలను, కోళ్లను బలి ఇస్తూ పూజా కార్యక్రమాలు సాగాయి. ముత్యాల పోచమ్మ ఆలయం వద్ద గ్రామ దేవత కొలుపు పూజలు పోతరాజుల విన్యాసాల మధ్య నిర్వహించారు. పాడిపంట, వ్యాపారాలను, కాలనీ వాసులను అందరిని చల్లంగా చూడమని గ్రామ దేవతలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలతో పాటు ముత్యాల పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, పూజారులు పాల్గొన్నారు.

## మత్స్య కారుల సంక్షేమానికి కృషి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేయాలని, రాబోయే బడ్జెట్‌లో 500 కోట్లు కేటాయించాలని మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చార్వాక హాలులో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మత్స్యకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కృషి చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో మిషన్ కాకతీయ, ఉచిత చేపల పిల్లల పంపిణీలో కోట్ల రూపాయల అవినీతి జరి గిందని, మత్స్యకారులకు రావాల్సిన ప్రభుత్వ నిధులు రాలేదన్నారు. ప్రస్తుత ప్రభు త్వం ఉచిత చేప పిల్లలను కూడా ఇవ్వడం లేదని, ఉచిత చేప పిల్లలు ఇచ్చే బదులు సొసైటి అకౌంట్లలో డబ్బులు వేస్తే తామే నాణ్యమైన చేప పిల్లలను కొనుక్కుంటామని తెలిపారు. అలాగే 50 సంవత్సరాలు పూర్తయిన మత్స్యకారులకు రూ. 4 వేల పింఛన్ అందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బోడంకి చందు, శ్రీనివాస్, మహేష్, ప్రమీల, రేణుక, రమాదేవి, రాజన్న, రాజేష్, శ్రీనివాస్, మహేష్, ఆశన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సంస్మరణ సభ

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సాహితి సంరక్షణ సమితి సభ్యులు ఆదివారం మంచిర్యాలలో టీటీడీ ఆస్థానగాయకుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ వేద పండితుతు, జ్యోతిష్యశా స్త్రవేత్త కొమ్మెర విశ్వేశ్వరశర్మ హాజరై మాట్లాడారు. అన్నమయ్య కీర్తనలు బాలకృష్ణ ప్రసాద్ గాత్రంలో మరింత వినసొంపుగా మారాయని తెలిపారు. కేంద్ర సంగీత నాటక పరిషత్ అవార్డు పొందిన ఆయన 2006 నుంచి టీటీడీ అన్నామాచార్య ప్రాజె క్టుకు పనిచేశారని తెలిపారు. కార్య క్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కవులు చంద్రశేఖర్, భూ పతి, సంతోష్‌కుమార్, సు గుణాకర్, సుధాకర్, నగేష్ పాల్గొన్నారు.

## బస్తీ వాసుల అండతో.. ఒక్కటైన దివ్యాంగ జంట

బెల్లంపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వాళ్లిద్దరూ దివ్యాంగులు. ఒకరు పుట్టుకతోనే అంధత్వం, మరొకరికి చిన్నతనంలోనే పోలియో. వారిని వివాహం చేసుకోవడానికి ఎవరు ముందుకు రాలేదు. దీంతో బస్తీవాసులందరు పెద్ద మనసు చేసుకుని ముందుకు వచ్చి వివాహం జరిపించారు. పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన తమ్మిడి భాగ్యమ్మ, సత్తయ్య కూతురు ప్రేమలత చిన్నప్పటి నుంచి పోలియోతో రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. దీంతో నడవలేకపోయింది. పెద్దపల్లి జిల్లా ఆదివారంపేట మండలానికి చెందిన కస్తూరి రాయమల్లమ్మ, ఓదెలు రెండవ కుమారుడు రమేశ్ పుట్టుకతోనే అంధుడు. ఇద్దరు దివ్యాంగులు కావడంతో ఇద్దరికి వివాహం కావడం లేదు. ఈ క్రమంలో బూడిదగడ్డ బస్తీకి చెందిన బస్తీవాసులు వీరిద్దరికి వివాహం చేయాలని నిశ్చయించారు. ఆ ఇద్దరి అభిప్రాయాన్ని తీసుకున్నారు. నిరుపేదలు కావడంతో బస్తీవాసులు అన్ని తామై శివాలయంలో వివాహం జరిపించారు. పుస్తెల నుంచి భోజనం వరకు ప్రతీ ఒక్కరు భాగస్వాములు వివాహం జరిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బడికెల రమేశ్, గోసిక రమేశ్, గడ్డం అశోక్‌గౌడ్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



బస్తీవాసుల సమక్షంలో వివాహం చేసుకుంటున్న దివ్యాంగులు

# విహారం....విజ్ఞానం...


- విద్యార్థుల క్షేత్ర పర్యటనలతో కొత్త అనుభవాలు



బొటానికల్ గార్డెన్‌లో ప్రత్యక్ష పరిశీన జరుపుతున్న విద్యార్థులు

కోటపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : నిత్యం చదువులతో బిజీగా ఉండే విద్యార్థులకు క్షేత్ర పర్యటనలు వారి ఒత్తిడిని తొలగించి విద్యా సముపార్జనకు సహాయ పడతాయి. విహారంతో పాటు విజ్ఞానం కూడా అందుతుంది. వెళ్లిన ప్రాంతాల్లో అక్కడి వ్యక్తులతో గ్రూప్ చర్చలు జరపడం ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకోవడంతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు మెరుగు పడతాయి. పాఠ్య పుస్తకాల్లోని విషయాలతో పాటు క్షేత్రస్థాయిలో ఆయా ప్రాంతాలు, వ్యక్తుల విశిష్టతను వివరిస్తూ చూపించడం ద్వారా అవి చిరకాలం గుర్తిండిపోతాయి. అందుకే ఇటీవల కాలంలో పలు పాఠశాలల విద్యార్థులను పలు విహార యాత్రలకు తీసుకువెళ్లి అటు విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్నారు. ఇటీవల మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్ స్కూల్ కు చెందిన 6 నుంచి 8వ తరగతి విద్యార్థులు మహారాష్ట్రలోని చంద్రపూర్ లోని బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. అక్కడున్న వివిధరకాల మొక్కలు, వాటి రకాలు, శాస్త్రీయ నామాలు, ఓపెన్ సైన్స్ సెంటర్, శిలాజాలు, వివిధ రకాలైన జంతుజాలం, జీవవైవిధ్యం తదితర అంశాలపై ప్రత్యక్ష పరిశీలన జరిపారు. దీంతో విద్యార్థుల్లో అనేక నైపుణ్యాలతో పాటు అవగాహన వస్తుందని ఉపాధ్యాయులు అంటున్నారు.


### మొదటిసారి వెళ్లాను ..



నేను మొదటిసారి విహార యాత్రకు వెళ్లాను. ఈ యాత్ర అనుభ వాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. స్నేహితులతో కలిసి సరదా గా గడపడంతో పాటు అనేక కొత్త విషయాలు తెలుసుకున్నాం. మా ఉపాధ్యాయులు మేము వెళ్లిన ప్రాంతాల విషయాలు కళ్లకు కట్టినట్లు వివరించారు. సైన్స్ పాఠ్య పుస్తకంలోని విజ్ఞానానికి సంబంధించిన రాకెట్‌నమూనా, వివిధ రకాల జంతువులు, శిలాజాలను నేరుగా చూ డడం ఆనందాన్నిచ్చింది.

- నెన్నెల శ్రీనిత్య, 7వ తరగతి మోడల్ స్కూల్, కోటపల్లి

### విద్యార్థులకు అవగాహన కలుగుతుంది



క్షేత్ర పర్యటనలు విద్యార్థులకు మంచి అనుభవాన్ని కలిగిస్తాయి. తరగతి గదిలో నేర్చుకున్న సిద్దాంతాలను ఆచరణలో ఎలా ఉపయో గించాలో అవగాహన కల్పిస్తాయి. పరిశోధన కేంద్రాలు, ప్రయోగశా లలు, బొటానికల్ గార్డెన్‌లాంటివి, సహజ వాతావరణ సందర్శనలు విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాన్ని అందిస్తాయి.

- రాజశేఖర్, ప్రిన్సిపల్, మోడల్ స్కూల్ కోటపల్లి

## వడదెబ్బ తగులకుండా అప్రమత్తంగా ఉండాలి

**వినయ్ ఉప్రె, వైద్యాధికారి**



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

**ఆంధ్రజ్యోతి:** ఎండలకు ప్రజలు వడదెబ్బ తగులకుండా ఏం జాగ్రత్తలు పాటిం చాలి?

**వైద్యాధికారి:** ఎండలకు ప్రజలు వడదెబ్బ తగులకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. ఉదయం 10 గంటల తరువాత బయటికి వెళ్లవద్దు. అత్యవసరమైన తలపై రక్షణగా గుడ్డ కట్టుకోవాలి. ప్రతి సబ్ సెంటర్‌లో ఓఆర్ఎస్ పాకెట్లు అందుబాటులో ఉంచాం. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** వైద్యశాలలో రోగ నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయా?

**వైద్యాధికారి:** వైద్యశాలలో అన్ని రకాల రోగ నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులు, పిల్లలకు సకాలంలో రోగ నిరోధక టీకా వేయించుకోవాలి.

**ఆంధ్రజ్యోతి:** వైద్యశాలలో సాధారణ ప్రసవాలు చేసేందుకు ఏం చర్యలు తీసుకుంటు న్నారు?

**వైద్యాధికారి:** వైద్యశాలలో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. వైద్యశాలలో మహిళా వైద్యురాలుతో పాటు పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉన్నారు. బాలింతలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. మందులు అందుబాటులో ఉన్నాయి.

**ఆంధ్రజ్యోతి:** వైద్యశాలలో జ్వరాలకు పరీక్షలు నిర్వహిస్తున్నారా?

**వైద్యాధికారి:** వైద్యశాలలో మలేరియా, టైఫాయిడ్ లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నాం. ఇతర పరీక్షలకు సంబంధించి రక్త నమూనాలను జిల్లా వైద్యశాలకు పంపించి రిపోర్టు తెప్పించుకుని చికిత్స అందిస్తున్నాం. రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

**- వాంకిడి, ఆంధ్రజ్యోతి**

# బస్సుల్లో రద్దీ

- కిక్కిరిసి వెళ్తున్న ప్రయాణికులు
- మహాలక్ష్మి పథకంతో పెరిగిన ప్రయాణాలు
- ఆర్టీసీ బస్సులు పెంచాలని వినతి




ఆర్టీసీ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు



కాగజ్‌నగర్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

కాగజ్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఆర్టీసీబస్సుల్లో ఉచితప్రయాణం కల్పించినప్పటి నుంచి ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగింది. కాగజ్‌నగర్ నుంచి వెళ్లే అన్ని రూట్లలోనూ ప్రయాణికులు కిక్కిరిసి ఉంటున్నారు. ఆర్టీసీబస్సుల్లో మహిళలు ఆధార్‌కార్డు చూపితే ఉచిత ప్రయాణాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ పథకం రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతమైంది. ఈ పథకంతో ఆర్టీసీ బస్సులకు రద్దీ నిత్యం పెరిగి పోతోంది. అధికంగా మహిళలే ప్రయాణాలు చేస్తున్నారు. ఏ బస్సు చూసినా రద్దీ ఉంటుంది. ఇక పండుగలు, ఇతర ప్రభుత్వ సెలవులకు మాత్రం ఆర్టీసీ ప్రాంగణం పూర్తిగా ప్రయాణికులతో నిండిపోతోంది. రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల పరిధిలో ఆర్టీసీ బస్సులు వెళ్లే అన్ని రూట్లలోనూ ప్రయాణికులు కిక్కిరిసి ఉంటున్నారు. జిల్లాలో కేవలం ఆసిఫాబాద్‌లోనే బస్సు డిపో ఉంది. మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టిన అనంతరం బస్సుల సంఖ్య పెరుగలేదు. ఉన్న వాటితోనే అధికారులు నెట్టుకొస్తున్నారు.

**● తప్పక ఆటోల్లో ప్రయాణం..**

బస్సు సేవలు లేని రూట్లలోనే ప్రజలు ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. జిల్లాలోని మారుమూల మండలాల్లో అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ సేవలు అందడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లోని మహిళలు మహాలక్ష్మి పథకానికి నోచుకోవడం లేదు. మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఆటోలో నడిపే వారికి సైతం గిరాకీలు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఆటో నడిపేవారికి చేయూతనిస్తామని చెప్పినా ఇప్పటివరకు హామీ అమలుకు నోచుకోవడం లేదని వాపోతున్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఒకే డిపో ఉంది. ఆసిఫాబాద్ డిపో నుంచి ఆర్టీసీ యాజమాన్యం ప్రతి రోజు అన్ని రూట్లలో 81షెడ్యూళ్ల 89బస్సులను ఆయా పట్టణాలు, గ్రామాలు, శివారు గ్రామాలకు నడుపుతోంది. సగటున ప్రతిరోజు 33,700కిలో మీటర్లు ఆర్టీసీ బస్సులు సేవలు అందిస్తున్నాయి. ఇందులో 30 వేల మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ప్రతీ రోజు డిపోకు రూ 18.8 లక్షల ఆదాయం సమ కూరుతోంది. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలకు సేవలు అందిం చేందుకు బస్సుల సంఖ్య పెంచితే సంస్థకు ఆదాయంతో పాటు ప్రయాణికులు మెరుగైన సేవలు అందనున్నాయి. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**అదనంగా బస్సులు నడిపించాలి..**

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపించాలి. ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసి వెళుతున్నారు. ఫుట్ బోర్డు ప్రయాణాలు నిత్యం జరుగుతున్నాయి. ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ప్రయాణికుల రద్దీ రూట్లలో అదనపు బస్సులు వేయాలి. పలు గ్రామాలకు రోడ్లు ఉన్నా ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. దీంతో మహిళలు మహాలక్ష్మి పథకానికి దూరమవుతు న్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం ఉన్న ప్రతీ గ్రామానికి బస్సు సేవలు అందించాలి.



**-మాచర్ల శ్రీనివాస్, కాగజ్‌నగర్**

## అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మమత(ఫైల్)

భీమారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన అంగడి మమత (35) అనే వివాహిత శనివారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. అయితే మమత గుండెపోటుతో మృతిచెందిందని ఆమె భర్త అంగడి మల్లయ్య పలువురికి తెలపడంతో జైపూర్ మండలం కిష్టపూర్‌కు చెందిన మృతురాలు సోదరి గోమాస మౌనిక అనుమానం వ్యక్తం చేస్తూ భీమారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో మండల ఎస్ఐ శ్వేత విచారణ చేపట్టారు. మృతురాలి సోదరి తెలిపిన వివరాల ప్రకారం.. మమతకు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. దంపతులకు ఒక కూతురు ఉంది. కొన్నేళ్లుగా మమత భర్త మతి స్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తున్నాడు. ఇప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులన్నీ అమ్మేయడంతో పాటు తరచూ అందరితో గొడవలు పెట్టుకునే వాడు. దీంతో భార్య భర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో ఉన్నట్టుండి మమత మృతి చెందడం అనుమానాలకు తావిస్తోంది. మృతురాలు సోదరి మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భీమారం ఎస్ఐ శ్వేత తెలిపారు.

# ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు చౌక్‌లో విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పూల మాలలు వేసి నివాళులు అర్పిం చారు. పొట్టి శ్రీరాములు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పలువురు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ సభ్యులు శ్రీనివాస్, జి శ్రీనివాస్, ప్రమోద్, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, శంకర్, మధుకర్, అరవింద్, అమూల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి):** కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం నాయకుడు ఘనపురం ప్రకాష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయానికి సువరం ప్రతాప్‌రెడ్డి గారి పేరు మార్చడం తగదని సూచించారు. దీన్ని విరిమించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో పూలమాల వేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంచిర్యాల క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జంజిరాల ఫణీంద్ర వర్మ (26) యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్షెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంచిర్యాల నుంచి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఫణీంద్ర వర్మ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంచిర్యాల క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అంతర్గాం బ్రిడ్జీ వద్ద గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని, సుమారు అతని వయస్సు 40 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. మంచిర్యాల లేదా నస్పూర్‌కు చెందిన వ్యక్తిగా అనుమానం వ్యక్తం చేశారు. వివరాల కోసం 8712656527లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో సూచించారు.

## ద్విచక్రవాహనం చోరీ

మంచిర్యాల క్రైం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి):మంచిర్యాల పట్టణం శ్రీనివాస థియేటర్ సమీపంలో నివాసం ఉంటున్న అభిషేక్ రేణువా కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ ద్విచక్రవాహనం చోరీకి గురైనట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 14న రాత్రి పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం తెల్లవారి చూసే సరికి కనిపించడం లేదని, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని చోరీ చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మహిళ మెడ నుంచి గొలుసు..

లక్షెట్టిపేట, మార్చి 16(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని గోదావరిరోడ్డులో ఆదివారం ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళ మెడలోంచి గొలుసు దొంగిలించినట్లు ఎస్సై సతీష్ తెలిపాడు. ఎస్సై కథనం ప్రకారం కొత్త శ్యామల ఇంట్లో ఒంటరిగా ఉండటం గమనించిన మరో మహిళ ఇంట్లోకి చొరబడి బాధితురాలి మెడలో ఉన్న సుమారు 3తులాల బంగారు పుస్తెలు తాడు లాక్కుని పరార్ అయ్యింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

## పోగొట్టుకున్న ఫోన్ అందజేత

కోటపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): దారిలో పోగొట్టుకున్న ఫోన్‌ను కనుగొని తిరిగి బాధితుడికి పోలీసులు అందించారు. మండలంలోని మల్లంపేట గ్రామానికి చెందిన దాగామ సంపత్ అనే వ్యక్తి చెన్నూరు నుంచి మల్లంపేటకు వచ్చి దారిలో ఫోన్ పోగొట్టుకున్నాడు. ఫోన్ రింగ్ అవుతున్నా దానిని ఎవరు లిఫ్ట్ చేయకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజేందర్ ఆధ్వర్యంలో పోలీసులు లోకేషన్ యాప్ ద్వారా దారిలో ఫోన్‌ను గుర్తించి తిరిగి బాధితుడికి అప్పగించారు. దీంతో సంపత్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జైపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారావుపేట శివారులో గోదావరి నుంచి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నామని జైపూర్ ఎస్ఐ శ్రీధర్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారనే సమా చారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జైపూర్ పోలీసులు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లను జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలుంటాయన్నారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్ల మీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామస్థులు సైతం ఇసుక తరలిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.




## వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలి

మందమర్రిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రారంభమైనందున గనుల్లో, ఓసీపీల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎండ నుంచి కొంత ఉపశమనం కలిగేందుకు పనివేళలు మార్చాలని సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి వెంకటస్వామి, రామగిరి రామస్వామి, అల్లి రాజేందర్ అన్నారు. స్థానికంగా ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మార్చి నెలలోనే ఎండలు మండిపోతున్నాయని ఎండ నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు చేతి రుమాళ్లు, గొడుగులు, టోపీలను వినియోగిస్తున్నారని తెలిపారు. పని చేసే కార్మికుల పరిస్థితి ఏమిటో యాజమాన్యం అర్థం చేసుకోవాలన్నారు. పనివేళలు మార్చడం ద్వారా అధిక ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. ఈ విషయంపై సింగరేణి సీఎండీకి కూడా వినతి చేయనున్నామని తెలిపారు. గనులపై మజ్జిగ పంపిణీ చేయాలని, మినరల్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలని, చల్లని నీరు అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యాలయాల్లో కంప్యూటర్‌లు పనిచేయని పరిస్థితులు ఉన్నందున ఏసీలను కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని చెప్పారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు ఈ విషయాలపై దృష్టి సారించాలన్నారు. అలాగే ఇన్‌కంటాక్స్ యాజమాన్యమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం కోసం పనిచేసే ఏకైక సంఘం సీఐటీయూనేనని తెలిపారు. సమావేశంలో నాయకులు ఐలయ్య, ఆదర్శ్, శ్రీకాంత్, శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

# కీలక పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయొద్దు

శ్రీరాంపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కీలకైన పోస్టులను అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయవద్దని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య అన్నారు. సీసీసీలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు సింగరేణి యాజమాన్యం పత్రికా ప్రకటన విడుదల చేయడం సరికాదన్నారు. దీనివల్ల ఇప్పటికే సంస్థలో పనిచేస్తున్న సీనియర్ అధికారులు తీవ్రంగా నష్టపోతారని, వారి మనోభావాలు దెబ్బతింటాయని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్య రక్షణకు తాము అనేక పోరాటాలు చేసి ప్రతి రీజియన్‌లో ఏరియా ఆస్పత్రులు, ప్రతి ఏరియాలో డిస్పెన్సరీలు ఏర్పాటు చేయించామన్నారు. వీటి నిర్వహణను పట్టించుకోని యాజమాన్యం నూతనంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ పోస్టును అవుట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయాలని చూడడం దారుణమని చెప్పారు. సెక్యూరిటీ సిబ్బంది సంస్థ ఆస్తుల రక్షణకు ఎంతో శ్రమిస్తున్నారని, ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వర్తిస్తున్నారని గుర్తు చేశారు.




మాట్లాడుతున్న ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య

ఆ విభాగంలో సైతం చీఫ్ సెక్యూరిటీ అధికారిని బయటి నుంచి తీసుకోవడం వల్ల రక్షణ సిబ్బంది మనోభా వాలు దెబ్బతింటాయని చెప్పారు. ఫలితంగా సంస్థకు నష్టం కలిగే అవకాశం ఉందని అన్నారు. దీన్ని కార్మికులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. సీఎండీ బలరాం స్పందించి నియామక ప్రకటనను వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి ఖమురయ్య, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, నవీన్ రెడ్డి, సురేష్, రాజ్‌కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

# అందుబాటులో ఫిజియోథెరపీ

» ఆర్‌కే-8 డిస్పెన్సరీలో రెండేళ్లుగా ఉచిత సేవలు

శ్రీరాంపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న కార్మికులకు ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. పలువురు కార్మికులు మోకాళ్ల నొప్పులు, నడుంనొప్పులు, కీళ్లనొప్పులు, నరాల జబ్బులు కలిగి ఉంటున్నారు. కుటుంబ సభ్యుల్లో సైతం కొందరు ఇదే మాదిరిగా ఇబ్బందుల పడుతున్నారు. దీంతో వారిని వైద్యులు ఫిజియోథెరపీకి రిఫర్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ రకాలుగా కలిగే నొప్పులకు రెండేళ్లుగా సింగరేణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫిజియో థెరపీ కేంద్రం ఉచితంగా సేవలందిస్తోంది. ఈ కేంద్రంలో రోజు సుమారు 70 మందికి పైగా సేవలు వినియోగించు కుంటున్నారు. ప్రైవేటు కేంద్రాలలో ఒక్క రోజు ఫిజియోథెరపీకి 500ల రూపాయలు వసూలు చేస్తు న్నారు. ఇంటికి వచ్చి సేవలందిస్తే 1000 రూపాయలు తీసుకుంటున్నారు. ఇలా నొప్పి తగ్గే వరకు వేల రూపాయలు ఖర్చు చేసి చికిత్స పొందాల్సి ఉంటుంది. ఈ ఇబ్బందులు తప్పించాలని 22 మార్చి 2022న శ్రీరాంపూర్ ఏరియా యాజమాన్యం ఆధ్వర్యంలో ఆర్‌కే 8 డిస్పెన్సరీలో ఫిజియోథెరపీ కేంద్రం ఏర్పాటు చేశారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచి తంగా సేవలందిస్తోంది. వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు, పక్షవాతం వచ్చిన వారు, జాయింట్ పెయిన్స్ తుంటి, మోకాలు ఆపరేషన్, ఎముకలు విరిగిన అనంతరం అవసరమైన వారు ప్రతి రోజు సుమారు 70 మంది వరకు ఇక్కడికి వచ్చి సేవలు పొందుతున్నారు. ఇందులో మూడేళ్ల వయస్సు నుంచి 84 ఏళ్ల వయస్సు వారున్నారు. శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఉద్యోగులు, అధికారులు, వారి కుటుంబ సభ్యులే కాకుండా మందమర్రి ఏరియా వారు సైతం ఇక్కడికి వస్తుండడం గమనార్హం.

**అధునాతన పరికరాలు**

ఈ కేంద్రంలో ఫిజియోథెరపీకి అవసరమైన సుమారు 50 రకాల అధునాతన పరికరాలు అందు బాటులో ఉన్నాయి. మరిన్ని తెప్పించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. చికిత్స పొందేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ఇప్పుడున్న గది సరిపోవడం లేదు. అందుకే అదనంగా నూతన గదిని నిర్మిస్తున్నారు. దీంతో ఒకేసారి పది మందికి చికిత్స అందే అవకాశం ఉంది. ఫిజియోథెరపీ కేంద్రం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సాయంత్రం 3.30 గంటల నుంచి 6.00 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఐదుగురు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు.



మెడనొప్పికి చికిత్స చేస్తున్న సిబ్బంది(ఫైల్)



నూతన పరికరాన్ని ప్రారంభిస్తున్న డీవైసీఎంఓ రమేష్‌బాబు(ఫైల్)

**నొప్పులకు మాత్రలతో..**


నొప్పులకు మాత్రలు అధికంగా వేసుకోవడం వల్ల కిడ్నీలు, లివర్, జీర్ణాశయం దెబ్బతినే ప్రమాదం ఉంది. బదులుగా ఫిజియోథెరపీతో నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది. మాత్రల అవసరం ఎక్కువగా ఉండదు. బాధితులకు డబ్బు, సమయం ఆదా అవుతున్నాయి. అధునాతన లేజర్, అల్ట్రాసౌండ్, తదితర పరికరాలు అందు బాటులో ఉన్నాయి.

**- రమేశ్‌బాబు, డిప్యూటీ చీఫ్ మెడికల్ అధికారి**

## వేలంలో పాల్గొంటేనే సింగరేణికి భవిష్యత్తు

శ్రీరాంపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్వహించే బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటేనే సింగరేణి సంస్థకు భవిష్యత్తు ఉంటుందని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్‌ప్రసాద్ అన్నారు. శ్రీరాంపూర్-నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎండీ స్పందించి వేలంలో పాల్గొనేలా అధికారులను ఆదేశించాలని చెప్పారు. సమావేశంలో కేంద్ర సీనియర్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య, నర్సిం హారావు, కేంద్ర ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి స్వామి, మైనిం గ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి భీమ్ రవి తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ కార్మికులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

బెల్లంపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికులకు గ్రాట్యుటీ 20లక్షలకు పెంచి యాజమాన్యం న్యాయం చేయాలని టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మణిరాంసింగ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు జనవరి 2016 నుంచి ఫిబ్రవరి 2018 మధ్య పదవీ విరమణ చేసిన సింగరేణి ఉద్యోగులకు గ్రాట్యుటీ 20లక్షలు పెంచి ఇవ్వాలని టీఎన్‌టీయుసీ సంఘం తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ విషయంపై పలుమార్లు డిప్యూటి లేబర్ కమిషన్ దగ్గరికి వెళ్లి వినతి పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం మాత్రం గ్రాట్యుటీ విషయంలో స్పందించకపోవడం సరైంది కాదన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, సింగరేణి యాజమాన్యం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని లేని యెడల టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, మేకల రాజయ్య, సత్తయ్య, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అతివలకు బీమా

# అవగాహనతోనే ధీమా..

● స్వయం సహాయక సభ్యులకు చేకూరనున్న ప్రయోజనం

● ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షలు

● అంగవైకల్యం కలిగితే రూ. 5 లక్షలు



జైపూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : అతివల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా ప్రభు త్వాలు రుణాలను అందిస్తున్నాయి. సంఘాల ఏర్పాటు ద్వారా సభ్యులు రుణాలను పొందుతూ స్వశక్తితో ఎదు గుతున్నారు. లక్షలాది మంది మహిళలు ప్రగతి మార్గంలో పయణిస్తున్నారు. సంఘాల్లోని మహిళలకు మ రింత ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రతి మహిళకు బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణ యించింది. సం ఘాల్లో సభ్యురాలుగా ఉండి స్త్రీనిధి ద్వారా రుణం తీసు కున్న మహిళ అనివార్య కారణాల వల్ల మరణిస్తే రూ. 2లక్షల లోపు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించేది. తాజాగా ప్రభుత్వం ఈ విధానాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా తీసు కున్న వారికి కూడా వర్తింపజేసేలా చేసింది.

సమావేశంలో పాల్గొన్న పొదుపు సంఘాల మహిళలు

## ● లక్ష మందికి ప్రయోజనం

జిల్లా వ్యాప్తంగా 16 మండలాల్లో వీవోఎస్ 468, ఎస్ హెచ్‌జీఎస్ సంఘాలు 10198, మహిళ సంఘం సభ్యు లు 1,01,980 మంది ఉన్నారు. అర్హత కలిగిన ప్రతి మ హిళ స్వయం సహాయక సంఘాల్లో చేరాలన్న ఉద్దేశ్యం తో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించి ప్రోత్స హిస్తుం ది. సంఘం సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకుని చిరు వ్యా పారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీకి స్త్రీనిధి, మ హిళ శక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలను అం దజేస్తున్నారు.

## ● రుణ బీమా రూ. 2 లక్షలు

ఒక్కో సంఘానికి రూ. 5 లక్షల నుంచి రూ. 20 లక్ష ల వరకు రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మ హిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుం బ సభ్యులు చెల్లించాల్సి వచ్చేది.

## ●18 నుంచి 65 ఏళ్ల వయస్సు వారికి

పొదుపు సంఘాల మహిళలు మృతి చెందితే వారి కుటుంబాలకు రూ. 10లక్షల ఉచిత బీమా వర్తింపజే యనున్నారు. ఒక వేళ వంద శాతం వైకల్యం కలిగినా రూ. 10లక్షలు అందిస్తారు. 50శాతం వైకల్యం కలిగితే రూ.5లక్షలు చెల్లిస్తారు. మృతిచెందిన మహిళలకు పొ దుపు అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు. గాయా లైన మహిళ అంగ వైకల్యం చెందుతూ సదరం ధృవప త్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సున్న పొదుపు మహి ళలకు ఇది వర్తిస్తుంది.

అలా చెల్లించక పోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదు పు మహిళలకు ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రుణ బీమా వర్తింపజేస్తుంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకా ల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టా ల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.

## ● అవగాహన అవసరం

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పథకాలలో అర్హత సాధించాలంటే తప్పని సరిగా అన్ని గ్రూపుల వారు నెల వారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబంధించిన వివ రాలు, నిధి పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయా లి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. వీటి వివరాలు ఉండాలి. అయితే ఇలాంటి వాటిపై మ హిళల్లో అవగాహన లేదు. రుణం పొందే సమయంలో మాత్రమే వీవోలు నమోదు చేస్తున్నారు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు దృష్టి సారించాలి.

## ● మహిళలకు ఎంతో ప్రయోజనం



మహిళ సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండురకాల బీమా సౌకర్యం కల్పించడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వారి కుటుంబాలకు రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. ఇంతకు ముందు స్త్రీనిధికి మాత్రమే ఉండేది. బ్యాంకు లింకేజీకి కూడా వర్తింపజేశారు. మహిళ సంఘాల సమావేశంలో సభ్యులందరికి అధికారులు, సమైక్య బాధ్యులు బీమా గు రించి వివరిస్తున్నారు. మహిళా సంఘాలకు అవగాహ న కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

**-రాజ్‌కుమార్, ఏపీఎం, జైపూర్**

# ఎస్టీపీపీలో కొత్త యూనిట్..

(5వ పేజీ తరువాయి)

చేసి రాష్ట్ర గ్రిడ్‌కు సరఫరా చేసింది. త్వ రలో మూడో యూనిట్ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతుండగా, ఈ మేరకు సింగరేణి హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్ సంస్థతో ఇటీవల ఒప్పం దం పూర్తి చేసుకుంది. గత ఫిబ్రవరిలోనే ఈ కాంట్రాక్ట్‌ను బీహెచ్ ఈఎల్ దక్కించుకోగా, అగ్రిమెంట్ పూర్తయిన నాటి నుంచి నాలుగే ళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాల్సి ఉంది. అయితే అందుకు భిన్నంగా కే వలం 40 నెలల్లోనే ప్లాంట్‌ను అందుబాటులోకి తేవాలని యాజ మాన్యం సన్నాహాలు చేస్తోంది.

## ●కొత్త ఉద్యోగాలకు అవకాశం..

ఎస్టీపీపీలో మరో యూనిట్‌ను విస్తరిస్తుండగా, నిరుద్యోగ యువ తకు ఉద్యోగ అవకాశాలు కూడా ఏర్పడనున్నాయి. ఇప్పటికే సంస్థలో సుమారు రెండు వేల వరకు శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు పని చే స్తుండగా, మూడో యూనిట్ అవసరమైన మరో 1200 వరకు కొత్త ఉద్యోగాలు కల్పించనున్నారు. దీంతో ఉద్యోగావకాశాలు మెరుగు పడ గా, నూతనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కూడా రాష్ట్ర అవసరాలకు విక్రయించనుంది.

## ●డిప్యూటీ సీఎంతో శంకుస్థాపన..?

ఎస్టీపీపీలో ఏర్పాటు చేయదలిచిన మూడో యూనిట్ విద్యుత్ ఉ త్పత్తి పనులకు త్వరలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మం త్రి భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి గత సంవ త్సరం మార్చి 12న హైదరాబాద్‌లో ప్రకటించారు. అయితే నూతన ప్లాంట్ ఏర్పాటుకు అగ్రిమెంట్ పూర్తికావడంతో త్వరలో శంకుస్థాప న చేయనుం డగా, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# పోలీసుల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోటపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరంపల్లి, కొల్లూరు, రాంపూర్ గ్రామాలకు చెందిన పలువురికి ఆదివారం కోట పల్లి పోలీసుల ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మం చిర్యాలకు చెందిన పవన్ ఆప్టికల్స్ వారి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేసి కంటి పరీక్షలు చేయించినట్లు చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ రాజేందర్ పేర్కొన్నారు. ఇందులో 32 మంది కంటి సమస్యలు ఉండగా వారికి సర్జరీ చేసేందుకు నిర్ణయించినట్లు పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, పోలీసులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి

తాండూర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో భర్త తన భార్య, అత్తపై దాడి చేసి గాయపర్చిన సంఘటన తాండూర్ మండలం లోని అచ్చలాపూర్ గ్రామంలోని కొమ్ముగూడెంలో ఆదివారం రాత్రి చో టు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెం దిన దాగం మల్లయ్య మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడే వాడు. ఆదివారం మల్లయ్య తన తండ్రి నెలమాసికం నిర్వహించాడు. ఈ కార్యక్రమం కోసం వచ్చిన అత్త రాజక్కతో పాటు తన భార్య మణి తతో మల్లయ్య గొడవ పడ్డాడు. మాటా మాటా పెరగడంతో అన్నం కలి పే పెద్ద సరాతంతో దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఇద్దరిని బంధువు లు 108లో బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫి ర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

# ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రయోజనంపై ప్రజలకు తెలియజేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : ఒకే దేశం ఒకే ఎన్నిక ప్రయోజనంపై ప్రజలకు తెలియజేయాలని బీజేపీ జిల్లా అ ధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా మాజీ అధ్యక్షుడు రఘు నాథ్ వెరబెల్లి పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలో నిర్వహించిన బీజేపీ మండల కన్వీనర్, కో కన్వీనర్‌లతో సమావేశంలో వారు మా ట్లాడారు. ఒకే దేశం ఒక ఎన్నిక వల్ల జరిగే ప్రయోజనాలను ప్రధా నమంత్రి మోదీ విధానాలను ప్రతి బూత్‌లో ప్రజల్లోకి తీసుకువెళ్లా లని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు.

# పరిశ్రమల మనుగడను దెబ్బతీస్తున్న పాలకవర్గాలు

**ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్**

మందమర్రిటౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు పరిశ్రమల మనుగడను దెబ్బతీస్తున్నాయని ప్రైవేటు పెట్టుబడిదారులకే పె ద్దపీట వేస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను లేకుండా చేస్తున్నాయని ఐఎఫ్‌టీయు జాతీ య ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించిన జీఎల్‌బీకేఎస్, టీజీఎల్‌బీకెఎస్ విలీన సభకు ఆయన ముఖ్య అతిథిగా హా జరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరోక్షంగా, ప్రత్యక్షంగా లక్ష లాది మందికి అన్నం పెడుతున్న సింగరేణి సంస్థను దెబ్బతీసే చర్యలకు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు సహకరిస్తున్నాయని, ఇంతకంటే మరోటి ఉండదని తెలిపారు. సింగరేణి సం స్థ పరిరక్షణ, నూతన గనుల ఏర్పాటుకు, ఉద్యోగ భద్రత సాధించుటకు త్వరలోనే చేప ట్టే పోరాటాలకు బొగ్గు గని కార్మికులు ముందుండాలన్నారు. సింగరేణిలో నూతన గను లు ఏర్పాటు చేయకపోతే ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయన్నారు. సత్తుపల్లి, కో యగూడెం, శ్రావణపల్లి, కెకె6 గనుల అమ్మకాలకు వ్యతిరేకంగా మూడు రోజుల సమ్మె తోపాటు అనేక ఆందోళనలు కార్మిక సంఘాలు అన్ని ఐక్యంగా నిర్వహించినప్పటికీ నా టి ఉద్యమంలో పాల్గొన్న ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీలు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల తరువాత స్వరం మార్చాయన్నారు. సింగరేణి సంస్థ కూడ టెండర్‌లో పాల్గొ నాలని చెప్పడం ఏమిటని వారు మండిపడ్డారు. సింగరేణిలోని గనులు సింగరేణికి కేటా యించాలని తమ డిమాండ్ అన్నారు. సింగరేణి పరిరక్షణతో పాటు నూతన గనుల ఏర్పాటు, ఉద్యోగ భద్రత కోసం ప్రాతినిధ్య సంఘాలన్నీ కలిసి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కుల సాధన కోసం కలిసి వచ్చే సం ఘాలతో పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నా యకులు, నరేశ్, అశోక్, రామకృష్ణా, ఎండీ జాఫర్, నాగేశ్వర్‌రావు, కృష్ణ, మల్లేశం, ప్ర సాద్, తాళ్లపల్లి శ్రీనివాస్, చిలుక శంకర్, రాయమల్లు, శేఖర్, పెరిక మొండయ్య, ప్ర సాద్, కొమురయ్య పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

# ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం



మల్లీడిలో హోమం చేస్తున్న భక్తులు

భీమిని, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లీడి గ్రామంలోని శివ పంచాయన తన అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వ హించారు. ఈ నెల 9 ఆదివారం నుంచి వారం రోజుల పాటు జిల్లాలోని వివిధ గ్రామాల ప్రజ లు, గ్రామస్థులు నిరంతర భజన కార్యక్రమాలు సాగాయి. ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ, వాస్తు, మన్యుసూక్త హోమాలు నిర్వహిం చారు. అనంతరం బలిప్రదానం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అ న్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీటీసీ కర్నె మమత, శ్రీనివాస్, రామకృష్ణ గ్రామస్థులు పాల్గొన్నారు.

## పదవీ విరమణ ఉద్యోగికి సన్మానం

జన్నారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : పీఎస్ హెచ్‌ఎం కామెర రాజేశ్వర్- పద్మా వతి పదవీ విరమణ సందర్భంగా ఆది వారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న మాట్లాడు తూ పదవీ విరమణ ఉద్యోగ, ఉపాధ్యా యులకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫి ట్స్‌ను, పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెం టనే విడుదల చేయాలని డిమాండ్ చేశా రు. ఈ కార్యక్రమంలో నాయకులు కమ లాకర్, వెంకటరావు, రాజేశ్వర్, రాజారా వు, గోపాల్, ప్రకాష్ నాయక్, విజయ్ కు మార్, రాజమౌళి, రాజేష్ నాయక్‌ర, రా జారావు పాల్గొన్నారు.


## అన్నదానం

జన్నారం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోండుగూడ, మొర్రిగూడ గ్రామాల్లో పేదలకు నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆఫ్ కౌన్సిల్ జిల్లా సభ్యులు అన్నదా న కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా జిల్లా వుమెన్స్ వింగ్ ప్రెసిడెంట్ బనావత్ సరోజ, వైస్ ప్రెసిడెంట్ సునీల్ కుమార్, సభ్యులు కృష్ణ, కిరణ్, గ్రామ పె ద్దలు సత్యనారాయణ, గంగారాం, కొము రంభీం, మారుతి, ప్రమీల, పద్మ, భీము, శ్రీను, హన్మంతు, శేఖర్, జగదీష్, రాజేం దర్ పాల్గొన్నారు.

## కుక్కల దాడిలో గాయాలు

బెల్లంపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప ట్టణంలోని స్టేషన్‌రోడ్డు కాలనీలో ఆదివా రం పలువురిపై కుక్కలు దాడి చేశాయి. అ దే కాలనీలో ఉంటున్న ఉదయ్ శంకర్ ఉ దయం వాకింగ్ వెళ్తున్న సమయంలో కుక్క లు ఒక్కసారిగా దాడిచేయడంతో కాలుకు గాయాలయ్యాయి. అదే విధంగా కరీంనగర్ లోని ప్రభుత్వ దవాఖానాలో విధులు నిర్వ హించే చందన విధులకు వెళ్తున్న సమ యంలో కుక్కలు దాడి చేశాయి. అలాగే మ రో ఇద్దరి మహిళలను, చిన్నారులను సైతం కుక్కలు దాడిచేయడంతో రైల్వే కాలనీలోని ప్రజలు ఒక్కసారిగా బెంబెలెత్తారు. మున్సి పల్ అధికారులు కుక్కల నివారణకు చర్య లు చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న సదానందం

మందమర్రిటౌన్, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాలను వై భవంగా నిర్వహిస్తామని, ఇందుకోసం ఆ లయ కమిటీ సమావేశం కూడా ఏర్పా టు చేశామని మారుతినగర్ అభయాం జనేయ స్వామి ఆలయ చైర్మన్ బండి స దానందం యాదవ్ తెలిపారు. ఆదివా రం ఆలయంలో విలేకరులతో మాట్లాడు తూ ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భం గా ఆలయంలో కళ్యాణానికి అన్ని ఏర్పా ట్లు చేస్తున్నామన్నారు. ఆలయ కమిటీ స భ్యుల సహకారంతో భక్తులకు ఇబ్బందు లు కలుగకుండా ఆలయంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్వామి వారిని దర్శిం చుకునేందుకు క్యూలైన్‌లను, తాగునీరు, తదితర ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేస్తామని తెలి పారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల నిరసనలు

**కేసీఆర్, కేటీఆర్, జగదీశ్ రెడ్డిల దిష్టిబొమ్మల దహనం**

బెల్లంపల్లి, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై చేసిన వాఖ్యలకు నిరసనగా ఆదివారం పట్టణం లో ని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కేసీఆర్, జగదీశ్ రెడ్డిల దిష్టిబొమ్మను దహనం చేశారు. పలు వురు మాట్లాడుతూ స్పీకర్‌కు బేషరతుగా బహిరంగ క్షమాప ణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా దళిత స్పీకర్ అని చూడకుండ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైంది కాద న్నారు. బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేయడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో నా య కులు కంకటి శ్రీనివాస్, చిప్ప మనోహర్, జమ్మికుంట విజ య్, రాములు నాయక్, ఆకాశ్, రాజేశ్ పాల్గొన్నారు.

**కాసిపేట :** స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించిన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను ఆదివారం కొండాపూర్ యాప వద్ద కాంగ్రెస్ నాయకులు దహ నం చేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ముత్యాల రాజమౌళి మాట్లా డారు. స్పీకర్‌ను అవమానించిన వారికి సరైన విధంగా శిక్షిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుండ శ్రీ నివాస్, రాజిరెడ్డి, గోలేటి స్వామి, సత్తయ్య, ధారవత్ దేవి కొం డయ్య, బీమ్లానాయక్, తిరుపతి, రవి, శ్రీనివాస్, సాయికి రణ్, నర్సయ్య, మహంకాళి పాల్గొన్నారు.

**దండేపల్లి:** దండేపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కేటీఆర్ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ నా యకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాం ధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రి మూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంక టేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, యూత్ కాం గ్రెస్ మండల అధ్యక్షుడు సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

**మందమర్రిటౌన్ :** బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ నా యకులు దహనం చేశారు. అంతకు ముందు దిష్టిబొమ్మ లతో రాష్ట్రీయ రహదారిపై ర్యాలీ చేపట్టారు. కాంగ్రెస్‌పార్టీ చెన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు నయీం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్, రాజేందర్, సునీల్, కుమార్, సుధాకర్, సాగర్, అభిలాష్, రాకేష్, రతన్ కైలాష్, సతీష్ పాల్గొన్నారు.





బెల్లంపల్లి, మందమర్రిలో మందమర్రిలో కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**లక్సెట్టిపేట:** కాంగ్రెస్ నాయకులు ఆదివారం లక్సెట్టిపే ట చౌరస్తాలో రాస్తారోకో చేసారు. కేటీఆర్, జగదీశ్‌రెడ్డి ల దిష్టిబొమ్మలను దహనం చేసారు. ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, పట్టణ అధ్యక్షుడు ఎం డీ, ఆరీఫ్, ట్రాన్స్‌పోర్టు డైరెక్టర్ అంకతి శ్రీనివాస్, మాజీ కౌ న్సిలర్ చెల్ల నాగభూషణం, రాందేని వెంకటేష్, సురేష్ నా యక్, నాయకులు అన్నం చిన్నయ్య, రాజలింగు, రంజిత్ సింగ్, రాజు, నర్సయ్య, కాంతయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**తాండూర్:** మాజీ సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మను ఆదివారం తాండూర్ ఐబీలో కాంగ్రెస్ నాయకు లు దహనం చేశారు. వెంటనే ఎమ్మెల్యే బేషరతుగా క్షమాప ణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రె స్ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, జిల్లా ఉపాధ్యక్షుడు సూ రం రవీందర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ చైర్మన్ కదారి రత్నా కర్‌రావు, మాజీ గ్రంథాలయ చైర్మన్ సల్వాజీ మహేందర్ రా వు, మాజీ ఎంపీటీసీ సిరంగి శంకర్, నాయకులు పాల్గొన్నారు.

**భీమిని :** స్పీకర్‌పై అభ్యంతర వ్యాఖ్యలు చేసి నందునకు గాను మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మలను మండల కాంగ్రెస్ నాయకు లు దహనం చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షు డు గాధం లక్ష్మీనారాయణ, నాయకులు ఎల్లాగౌడ్, శ్రీనివాస్ గౌడ్, నవీన్, ప్రసాద్, కొమరయ్య పాల్గొన్నారు.

**కన్నెపల్లి :** కన్నెపల్లి మండల కేంద్రంలో ఆది వారం ఎమ్మెల్యేలు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టి బొ మ్మలను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయ, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అంకూస్, నాయకులు పాల్గొన్నారు.



కొండాపూర్ కేసీఆర్, జగదీశ్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



# పీఎంశ్రీ నిధులు ఖర్చయ్యేనా?

**ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్రం రూపొందించిన పీఎంశ్రీ పథకం అమలుకు ముందడుగు పడడం లేదు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదు ఆధారంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, కేజీ బీవీ సంక్షేమ గురుకులాలను ఈ పథకం కింద ఎంపిక చేసి నిధులు కేటాయించారు.**



పీఎంశ్రీ నిధులతో చేపడుతున్న పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం



నాసిరకంగా ఉన్న ఇటుకలతో చేపడుతున్న పనులు

- జిల్లాలో 18 పాఠశాలలు ఎంపిక
- మార్చిలోగా పూర్తి చేయాలని నిబంధన
- నత్తనడకన సాగుతున్న పనులు
- ప్రధానోపాధ్యాయులకే బాధ్యతలు అప్పగింత

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కేంద్రం రూపొందించిన పీఎంశ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా స్కీం) పథకం కింద చేపడుతున్న పనులు నత్తనడకన కొనసాగుతు న్నాయి. ఎంపిక చేసిన ప్రభుత్వ, స్థానిక సంస్థలు, గురుకుల సొసైటీ, కస్తూర్బా, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతుల సంక్షేమ, ఆదర్శ పాఠశాలల్లో గుణాత్మక విద్య, ఆధునిక వసతుల కల్పనకు కేంద్రం 60 శాతం, రాష్ట్ర 40 శాతం చొప్పున నిధులు సమకూర్చుతున్నాయి. జిల్లాలో మొత్తం 18 పాఠశాలల్లో 13 మొదటి విడతలో ప్రారంభమయ్యాయి. మిగిలిన ఐదు పాఠశాలలు రెండో విడతలో ప్రారంభించారు. ఆయా పనుల నిమిత్తం ఇప్పటి వరకు రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నెలాఖరులోగా ఖర్చు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు కొన్నింటిలో 50 శాతం, మరికొన్ని 80 శాతం పనులు పూర్తి అయ్యా యి. బడిబాట, బోధనాభ్యసన సామగ్రి కొనుగోలుకు, వర్క్ బుక్ తయారీ, స్కూల్ గ్రాంటు, ప్రీ ప్రైమరీ రికరింగ్ గ్రాంటు, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, గ్రీన్ స్కూల్, క్షేత్ర స్థాయి పర్యటన పాఠశాలలకు అదనపు తరగతి గదులు, నూతన భవనాలు, మరమ్మతులకు నిధులు వినియోగించాలి. పనులు పూర్తి చేయడనికి ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన ఉంది. లేకుంటే నిధులు మురిగిపోయే ప్రమాదం ఉంది.

**● ఎంపికైన పాఠశాలలు ఇవి..**

కుమరం భీం జిల్లాలో ఈ పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. ఆసిఫాబాద్‌లోని మోడల్ స్కూల్, ట్రైబల్ వెల్ఫేర్, బెజ్జూరులోని ఎంపీపీఎస్, జడ్పీహెచ్ఎస్, దహెగాం మండలంలోని చిన్నరాస్పెల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్, జైనూర్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలను ఎంపిక చేశారు. కాగజ్‌నగర్ మండలోని బలగల మైనారిటీ బాలుర 2 పాఠశాల/కళాశాల, నజ్రూల్‌నగర్‌లోని 12క్యాంపు లో ప్రభుత్వ హైస్కూల్, కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఓల్డు హైస్కూల్, కెరమెరి మండలంలోని సావర్ ఖేడా ఎంపీపీఎస్, కౌటాల మండలంలోని బండలేటి ఎంపీయూపీఎస్ ఎంపికయ్యాయి. పెంచికల్‌పేట, రెబ్బెన, సిర్పూరు(టి)లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు సిర్పూరు(యు) టీజీఎంఎస్, తిర్యాణి మండలం గంభీరావుపేటలోని ఎంపీయూపీఎస్, వాం కిడి మండలంలోని వాంకిడి కలన్‌లోని జడ్పీహెచ్ఎస్ తో పాటు కేజీబీవీపీ పాఠశాలు ఎంపికయ్యాయి.కాగా ఈ పథకం కింద మొదటి విడతగా ఎంపికైన పాఠశాలల్లో సుమారు 80 శాతం పూర్త య్యాయని చెబుతున్నారు. రెండో విడతగా ఎంపికైన పాఠశాలలకు మాత్రం ఇంకా 50 శా తం పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొనిపనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

**● సమకూరే వసతులు..**

పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి బాలవాటిక ఏర్పాటు, పాఠశాలల అవసరాలకు ప్రత్యేక గ్రాంటు, విద్యార్థులకు రవాణ భత్యం, క్రీడా వసతులు, ప్రాథమిక పాఠశాలలలో టీఎల్ఎం సామగ్రి, రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్ కింద సైన్సు, గణితం సర్కిల్ సందర్శనలు, వినూత్న ప్రాజెక్టులు, యూత్ ఏకోక్లబ్‌ల ఏర్పాటు చేయనున్నారు. పాఠశాల విద్యార్థుల భద్రత చర్యలు, కృత్రిమ మేధపై అవగాహన, విద్యార్థులందరికీ ఏక్ భారత్, శ్రేష్ట భారత్ గ్రంథాలయాల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అటల్‌టింకరింగ్ ల్యాబ్, వర్చువల్ రియాలిటి ల్యాబ్స్, వైద్య శిబిరాలు, వార్తా పత్రికలు, మ్యాగజైన్లు సమకూర్చడం, దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు, బాలికలకు సెల్ఫ్ డిఫెన్సింగ్ శిక్షణ అందించనున్నారు. వృత్తి శిక్షణ, మానసిక, శారీరక ఆరోగ్య పరిరక్షణ, ఉచితంగా యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, అదనపు తరగతి గదులు, సైన్సుల్యాబ్‌లు, మరమ్మతులు చేసేందుకు అవకాశాలుంటాయి. కిచెన్ గార్డెన్, ఐసీటీ, డిజిటల్ పరికరాలు, ఉపాధ్యాయులకు శిక్షణ కల్పించనున్నారు. వసతులు, క్షేత్ర స్థాయి పర్యటనలు పీఎంశ్రీ నిధులతో చేపట్టనున్నారు.

**పనులు పూర్తి చేస్తాం..**
**- ప్రభాకర్, కాగజ్‌నగర్ ఎంఈవో**

పీఎంశ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా స్కీం) పథకం కింద పాఠశాలల్లో కొనసాగుతున్న పనులు వేగంగా పూర్తి చేయిస్తాం. పనుల్లో అలసత్వం వహించొద్దని ఇన్‌చార్జిలకు సూచించారు. గడువులోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

## రాష్ట్రంలో రానున్నది బీజేపీ ప్రభుత్వమే

● ఎమ్మెల్సీ అంజిరెడ్డి



ఎమ్మెల్సీ అంజిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన జిల్లా అధ్యక్షుడు పదవీ బాధ్యత ల స్వీకరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు గడపగడపకు అందేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలే పార్టీకి బలమన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేసి వచ్చే స్థానిక సంస్థల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపు నిచ్చారు. జిల్లాలో వనరులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. జిల్లాను అన్ని విదాలుగా అభివృద్ధి చేసేందుకు అందరి సమన్వయంతో ముందుకు సాగాలని పార్టీ జిల్లా అధ్యక్షుడికి సూచించారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడిపై పెట్టుకున్న నమ్మకాని వమ్ము చేయవద్దన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం అందిస్తున్న సహాయ సహకారాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించారని అన్నారు. కేవలం 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందన్నారు. జిల్లాలో నెలకొన్న సమస్యలతో పాటు పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో చర్చించాలని ఎమ్మెల్సీని కోరారు. అనంతరం అంజి రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, కొత్తపల్లి శ్రీనివాస్, విజయ; మురళీ, శ్యాంసుందర్, మల్లారెడ్డి, రఘునాథ్, కృష్ణకుమారి, సొల్లు లక్ష్మి, ఏమాజీ, సతీష్, మల్లికార్జున్, సతీష్, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

రెబ్బెన, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మానసికోల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని రెబ్బెన సీఐ బుద్దెస్వామి అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్ షిప్‌లోని శ్రీ భీమన్న స్టేడియంలో ఆదివారం పోలీసులు, విలేకరుల మధ్య ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడల ద్వారా మానసిక ఒత్తిడి దూరమవుతుందన్నారు. శరీర దారుఢ్యతకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ పోటీల్లో పోలీస్ టీం విజేతగా నిలిచింది. కార్యక్రమంలో రెబ్బెన ఎస్సై డి.చంద్రశేఖర్, టీయూడబ్ల్యూజె ఐజెయు జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్ కుమార్, రెబ్బెన ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణ, రామస్వామి, రాజ్‌కుమార్, సంజీవ్‌కుమార్, పోయ్య, రమేష్, కిరణ్‌కుమార్ దాసుబాబు సాయితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు పేరు మార్చడం సరికాదు

బెజ్జూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్పు సరికాదని ఆర్యవైశ్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సతీష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును చేరుస్తూ అసెంబ్లీలో తీర్మానించడంపై ఆయన మండి పడ్డారు. దీంతో వైశ్యుల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు ప్రతాపరెడ్డిని గౌరవించాలని అన్నప్పుడు ప్రభుత్వం ఏదైనా కొత్త ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు దాని పేరు పెట్టాలని చెప్పారు. కాని ఏళ్ల నుంచి విశ్వవిద్యాలయానికి ఉన్న పేరును తొలగించడం సరికాదన్నారు. ఇప్పటికైనా మార్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## చుక్కల దుప్పిని చంపిన ముగ్గురిపై కేసు

పెంచికలపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లోడ్పల్లి అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పిని వేటాడి చంపిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడారు. శనివారం రాత్రి లోడ్పల్లి గ్రామ శివారులో కొత్తవాడ సమీపంలో అటవీ ప్రాంతంలో తమ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా లోడ్పల్లికి చెందిన గొర్లపల్లి శేఖర్, బొల్లబోయిన గంగయ్య, ఆత్రం శంకర్ అనుమానాస్పదంగా కనిపించారని చెప్పారు. అటవీ శాఖ అధికారులను చూసి వారి చేతిలో ఉన్న మాంసపు సంచులను అక్కడే వదిలేసి పారిపోయారన్నారు. అటవీ అధికారులు వారిని వెంబడించి కొత్తవాడకు వెళ్లి విచారణ చేపట్టారని అన్నారు. సంఘటన స్థలాన్ని అటవీ శాఖాధికారులు పరిశీలించగా చుక్కల దుప్పి చర్మం లభించిందని చెప్పారు. విచారణలో భాగంగా పారిపోయిన వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకున్న వారిలో ఎఫ్ ఎస్ఓ వేణుగోపాల్‌రావు, బీట్ అధికారులు లచ్చన్న, సతీష్, మహేష్‌ఉన్నారు.

## చికిత్స పొందుతూ బాలుడి మృతి

సిర్పూర్(టి), మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. సిర్పూర్(టి) మండల కేంద్రానికి చెందిన రియాజ్ ఉల్ ఖాన్ కుమారుడు మహమ్మదుల్లాఖాన్(10) మూడు రోజుల క్రితం మండల కేంద్రంలోని పేట్‌మహిళ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు మంచిర్యాల కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మహమ్మదుల్లా ఖాన్ మృతి చెందాడు. మహమ్మదుల్లా ఖాన్ తండ్రి ఫిర్యాదు మేరకు మండల కేంద్రానికి చెందిన దుర్గం కళ్యాణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కాగజ్‌నగర్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం కోసిని సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సిర్పూర్(టి) నుంచి కాగజ్‌నగర్ వైపు అతివేగంతో వచ్చిన బొలెరో వాహనం రోడ్డు దాటుతున్న తోపుడు బండి యజమాని మహబూబ్ ఖాన్(52)ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం అదే వేగంతో ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న కార్తీక్, ఈశ్వర్, తరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి గాయపడ్డ వారిని స్థానికులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు సంఘటన స్థలానికి రూరల్ ఎస్సై సందీప్ చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## దంచి కొడుతున్న ఎండలు

ఆసిఫాబాద్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎండలు దంచి కొడుతుండడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఆదివారం రాష్ట్రంలోనే జిల్లాలో 42.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆసిఫాబాద్ మండలంలో 42.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కెరమెరిలో 42.3, బెజ్జూరులో 42.1, రెబ్బెనలో 41.9, కౌటాలలో 41.8 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తిర్యాణి, పెంచికలపేటలో 41.6, సిర్పూర్ (టి), వాంకిడిలో 41.5 దహెగాంలో 41.4 , కాగజ్‌నగర్‌లో 41.1, చింతలమానేపల్లిలో 40.7, జైనూరులో 39.3, లింగాపూర్‌లో 38.3, సిర్పూర్ (యూ)లో 37.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

## మెరుగైన విద్యుత్ సరఫరాకు చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ సాంకేతికతతో వినియో గదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శేషారావు తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన మాట్లాడారు. ఇందులో భాగంగా అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ ఎయింటింగ్ ప్రక్రియ చేపట్టామని చెప్పాంప. ఇప్పటి వరకు 33 కేవీ పోల్ నంబరింగ్, 11 ఫీడర్‌లు పూర్తి అయ్యాయని తెలి పారు. వినియోగదారులకు మరింత నాణ్య మైన విద్యుత్ సరఫరా అందించ డానికి ఎప్పటిప్పుడు నూతన సాంకేతికత అం దిపుచ్చుకుటున్నామని చెప్పారు. అందుకు అనుగుణంగా అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నామని వివరించారు.

## యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

బెజ్జూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆదివారం బండలగూడలో యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో యువత అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. గ్రామాల్లో గుడుంబా, మత్తు పదార్థాలు వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం వాలీబాల్ కిట్‌ను అందజేశారు.

## మహంకాళి జాతర పోస్టర్ల ఆవిష్కరణ

రెబ్బెన, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని శ్రీ కనక దుర్గాదేవి మహంకాళి దేవస్థానంలో ఏప్రిల్ 12, 13 తేదీల్లో నిర్వహించే మహంకాళి జాతర పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దేవర వినోద్ స్వామి మాట్లాడుతూ ఏప్రిల్ 12న శివపార్వతుల కల్యాణం, 13న అమ్మవారి పుట్టిన రోజున జాతర ఉంటుందన్నారు. బోనాల సమర్పణ, రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతి గౌడ్, దుర్గం తిరుపతి, కనకయ్య, మల్లేష్, రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సభ్యులు

# బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ




ఆసిఫాబాద్‌లో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ దళిత వ్యతిరేక పార్టీ అని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు అన్నారు. పీసీసీ పిలుపు మేరకు దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుల జోలికి వస్తే సహించేది లేదని అన్నారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలను తప్పుపడుతూ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేశారన్నారు. కేటీఆర్‌కు దళితులపై ఎంత ప్రేమ ఉందో ప్రజలంతా గమని స్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమం లోనాయకులు చరణ్, బాలేష్‌గౌడ్, శ్యాం, ఖలీం, శివప్రసాద్, సురేష్, రమేష్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.


**వాంకిడి, (ఆంధ్రజ్యోతి):** అసెంబ్లీ సమావేశంలో దళిత స్పీకర్ ప్రసాద్‌పై ఎమ్మెల్యే జగదీశ్వర్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై కాంగ్రెస్ నాయకులు జదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయనను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, ప్రశాంత్, అనీల్, గణేష్, దీపక్, సంతోష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

**తిర్యాణి, (ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, కాంగ్రెస్ నాయకుడు అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో కేటీఆర్, జగదీష్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగర్, అమర్, శంకర్, హరీష్‌కుమార్, రాజశేఖర్, వెంకటేశంగౌడ్, శంకర్, విజయ్, చిన్నయ్య, బాలయ్య, శేఖర్, బాపురావు, లచ్చన్న, కొమురయ్య, రాంచందర్, అశోక్, శ్రీనివాస్, వెంకన్న, భీమయ్య, వెంకటేష్, ఆశాలు, ఎల్లయ్య, రాహుల్, రంజిత్ పాల్గొన్నారు.

**కెరమెరి, (ఆంధ్రజ్యోతి):** దళితులకు మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్ అన్నారు. ఆదివారం కెరమెరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జగదీశ్వర్‌రెడ్డి యావత్ దళిత జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్, నాయకులు కుసుంరావు, నానేశ్వర్, బాపురావు తదితరులు ఉన్నారు.



వాంకిడిలో జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తిర్యాణిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

## అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తి



పూర్తయిన రోడ్డు పనులు

దహెగాం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగు వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తడంతో రాక పోకలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పెద్దవాగు వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు సైడ్‌వాల్ రివిట్‌మెంట్ పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు పూర్తి కాగానే మిషన్ భగీరథ నీటి సరఫరా పైప‌లైన్ మరమ్మతులు చేపట్టనున్నామని డీఈ పృథ్వీరాజ్ తెలిపారు.

## కొనసాగుతున్న దీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట గిరిజన సంక్షేమ శాఖలో పని చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని చేపట్టిన దీక్షలు ఆదివారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ప్రజా సంఘాల నాయకులు శ్రీనివాస్, గిరిబాబు, పద్మ, సాయి, సాయికృష్ణ, దినకర్, రాజేందర్ మ ద్దతు తెలిపారు. ఈ సందర్భగా పలువురు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్యామల, పద్మ, నాగేశ్వరి, రమేష్, తార, రమేష్, ధృపతబాయి, లక్ష్మి, రాంబాయి, లక్ష్మి, కృష్ణ, శివరాం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రవాణా భత్యం విడుదల

ఆసిఫాబాద్‌రూరల్, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాలకు దూరంగా ఉండి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు ప్రభుత్వం రవాణా భత్యం విడుదల చేసింది. 2024-25కు సంబంధించిన నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దూర ప్రాంతాల నుంచి వచే విద్యార్థులకు రవాణా చార్జీలు 10నెలల పాటు నెలకు రూ. 600 చొప్పున అందించాలని నిర్ణయించింది. నాలుగేళ్ల తర్వాత రవాణా చార్జీలు చెల్లిస్తుండడంతో విద్యార్థుల ఇక్కట్లు తొలగిపోనున్నాయి. గతంలో రవాణా చార్జీల చెల్లింపులు నిలిచిపోవడంతో చాలామంది ఇబ్బంది పడ్డారు.

**సమీపంలో పాఠశాల లేక..**

సమీపంలో పాఠశాల లేక ప్రాథమిక పాఠశాలలకు కిలోమీటరు, ప్రాథమికోన్నత పాఠశాలలకు మూడు కిలోమీటర్ల వరకు, ఉన్నత పాఠశాలలకు ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లే విద్యార్థులు ప్రయాణ భత్యాన్ని పొందేందుకు అర్హులు. ఒక విద్యార్థికి ఏడాదికి రూ. 6వేల చొప్పున చెల్లిస్తారు. విద్యార్థి హజరు 80 శాతం ఉండాలి. రూ. 6వేలు రానుండటంతో తల్లిదండ్రులపై భారం తగ్గనుంది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో స్కూల్‌లెస్ హ్యాబీటేషన్స్(పాఠశాల తక్కువ అవాసాలు) విద్యార్థుల వివరాలను గుర్తించారు. దూర ప్రాంతాలకు వెళ్లి రవాణా భత్యం పొందే వారి లెక్క తేల్చారు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలల్లో 45, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 508, ఉన్నత పాఠశాలల్లో 299 మంది విదార్థులను అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రూ. 51.12 లక్షలు మంజూరయ్యాయి.